అన్యాయం చేస్తే సహించేది లేదు

- నిన్న మొన్న పార్టీలోకి వచ్చిన వారికి పదవులు ఇవ్వొద్దు
- అభిప్రాయం ఇస్తానంటే కుదరదు
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు హెచ్చరిక

మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 14 : 'ఇరవై ఏండ్లుగా పార్టీని పట్టుకొని ఉన్నా.. కష్టకాలంలో కూడా పార్టీని నడిపించిన.. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు దోహదపడినా.. ఇంద్రవెల్లి, మంచిర్యాల సభలను నా భుజాలపై వేసుకుని విజయవంతం చేసిన.. ఇప్పుడు నన్ను కాదని నిన్న.. మొన్న వచ్చిన వారికి పదవులు ఇస్తానంటే కుదరదు' అని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు కుండబద్దలు కొట్టారు. సోమవారం మంచిర్యాలలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, జైబాపు, జైభీం, జై సంవిధాన్ బహిరంగ సభలో పాల్గొనేందుకు వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు ఎదుట ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు అన్యాయం చేస్తే భరిస్తాను కానీ.. ఈ జిల్లాకు, నోరులేని అడవి బిడ్డలకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని స్పష్టంచేశారు. 74 ఏండ్లలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం జరిగిందని, ఆదివాసీల పక్షాన మాట్లాడే తన గొంతు నొక్కాలని చూడొద్దని ఆవేదనగా అన్నారు. 'ఇప్పటికే పార్టీలు మారి.. నిన్న మొన్ననే ఈ పార్టీలో కి వచ్చారు. ఒకే కుటుంబం నుంచి ముగ్గురికి అవకాశం ఇచ్చారు. ప్రస్తుతం వాళ్లు పదవులు అడుగుతున్నారు.. వాళ్లకు పదవులు ఇస్తే పార్టీకి నష్టం తప్పదు' అని చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్, ఎంపీ వంశీలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు అన్యాయం చేస్తే సహించేది లేదని మరోమారు స్పష్టంచేశారు.

'నమస్తే తెలంగాణ'పై అక్కసు..

అంతకుముందు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ.. 'నమస్తే తెలంగాణ' దినపత్రికపై అక్కసు వెళ్లగక్కారు. ఐటీ పార్కు పోతుందని 'నమస్తే తెలంగాణ'లో ఏదో రాశారట, దాని సంగతి శ్రీధర్‌బాబు చెబుతారని అన్నారు. వాస్తవానికి ఐటీ పార్కు పోతుందని 'నమస్తే తెలంగాణ'లో ఎక్కడా రాయలేదు. ఐటీ, ఇండస్ట్రియల్ పార్కుకోసం సేకరిస్తున్న భూముల విషయంలో జరుగుతున్న అన్యాయంపై బాధితులు కోర్టును ఆశ్రయించిన విషయాన్ని బాధితుల పక్షాన వార్త రాసింది. వాళ్లు హైకోర్టును ఆశ్రయించిన సంగతి, కోర్టు అధికారులకు సూచనలు చేసిన విషయాన్నే అందులో ప్రస్తావించింది. ఈ విషయాన్ని అర్థం చేసుకోకుండా ఆయన 'నమస్తే'పై నోరుపారేసుకున్నారు.

బీజేపీలో ఉంటే కేంద్రమంత్రి అయ్యేవాడిని: ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

బీజేపీలో ఉంటే కేంద్రమంత్రిని అయ్యేవాడినని చెన్నూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణలో మాట్లాడారు. తన తండ్రి వెంకటస్వామి హయాంలోనే ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా అభివృద్ధి చెందినట్టు పేర్కొన్నారు. మంచిర్యాలలో జరిగిన బహిరంగసభలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పార్టీలు తిరిగి వచ్చినవారికి మంత్రి పదవులు కట్టబెడితే సహించబోనని డిప్యూటీ సీఎం భట్టి సమక్షంలోనే వాఖ్యలు చేయడంపై వివేక్ ఈవిధంగా స్పందించారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానిస్తేనే పార్టీలోకి వచ్చినట్టు తెలిపారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేశారు. పార్టీలు మారడం ముఖ్యం కాదని.. ప్రజలకు ఎంత మంచి పని చేశామన్నదే ముఖ్యమని చెప్పుకొచ్చారు.

పీఎస్సార్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే వినోద్ ఫైర్

మంత్రి పదవిపై మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడిన తీరుపై బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ మండిపడ్డారు. సోమవారం రాత్రి బెల్లంపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గడ్డం కుటుంబంలో ముగ్గురికి టికెట్లు ఇచ్చారని ప్రేమ్‌సాగర్‌రావు పేర్కొనడం సరైన పద్ధతి కాదని అన్నారు. టికెట్లు ఎవరికి కేటాయించాలో అధిష్ఠానం సర్వే చేసి నిర్ణయం తీసుకుటుందని గుర్తుచేశారు. ప్రేమ్‌సాగర్‌రావు పై వ్యక్తిగతంగా తాము ఎప్పుడూ మాట్లాడలేదని స్పష్టంచేశారు. ఆయన తన పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి పదవి విషయంలో తుది నిర్ణయం అధిష్ఠానిదేనని పేర్కొన్నారు. 70 ఏండ్లుగా పార్టీకి సేవలు అందిస్తున్నామని, తనకు మంత్రి పదవి వస్తే ఆయనకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు.

రాజగోపాల్‌రెడ్డి దారెటు?

- ఓ ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేల సమక్షంలో ప్రభుత్వం, పార్టీ తీరుపై తీవ్ర వ్యాఖ్యలు
- ఓపిక నశించిందన్న వ్యాఖ్యలపై విస్తృత చర్చ
- యూరప్ వెళ్లే ముందు అధిష్ఠానానికి హెచ్చరికలు
- మంత్రి పదవి ఇవ్వకుంటే తన దారి తనదేనన్న సంకేతాలు

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): 'ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే 16 నెలల నుంచి మంత్రివర్గ విస్తరణ చేపట్టకపోవడం చాలా బాధకరం. అది కూడా నెలో.. రెండు, మూడు నెలలో, ఆరు నెలలో కాదు... ఎంపీ ఎన్నికలై కూడా 10 నెలలు కావస్తున్నది. మంత్రివర్గ విస్తరణ చేస్తలేరు. కనీసం లోకల్‌బాడీ ఎన్నికలు కూడా పెట్టలేదు. గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా చెప్పుకుందామంటే సర్పంచులు లేరు. ఎంపీటీసీలు లేరు. జడ్పీటీసీలు లేరు. ఇవన్నీ మీ ఇష్టమన్న మాట వాస్తవం కావచ్చు. కానీ, ఎన్నాళ్లు నానబెడతారు? నాకు కూడా ఓపిక నశించిపోయింది. నేను కూడా ఈ రోజు నుంచి అడగడం మొదలుపెడుతున్నా. బరాబర్ మంత్రి పదవి ఇవ్వాల్సిందే' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేల్చిన రాజకీయ బాంబు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర మంటలు రేపుతున్నది. రాజగోపాల్‌రెడ్డి వ్యూహాత్మకంగానే ఒకేసారి ప్రభుత్వ పెద్దలు, పార్టీ ముఖ్యులను టార్గెట్ చేస్తూ వ్యాఖ్యానించారనే చర్చ జరుగుతున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరొందిన ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కూడా ఉన్న వేదికపై నుంచే తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే తాడో-పేడో తేల్చుకునేందుకు సిద్ధమనే విధంగా స్పష్టమైన సంకేతాలు పంపించారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి మంత్రి పదవిపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కన్నేశారు. ఎంపీ ఎన్నికల్లో భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించుకొని వస్తే, తనకు మంత్రి పదవి ఇస్తామంటూ హామీ ఇచ్చారని రాజగోపాల్‌రెడ్డి అనేకసార్లు చెప్తూ వచ్చారు. ఇటీవల రాజగోపాల్‌రెడ్డి... సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లినప్పుడు 'నీకు మంత్రి పదవి ఫైనల్ అయ్యింది. 3న ప్రమాణ స్వీకారానికి సిద్ధంగా ఉండు' అని రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పినట్టు వార్తలొచ్చాయి. దాంతో రాజగోపాల్‌రెడ్డి అనుచరులు సైతం 'కాబోయే మంత్రి రాజన్న' అంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా పోస్టులు పెట్టారు. ఇంతలోనే ఏమైందో ఏమో మొత్తానికే మంత్రివర్గ విస్తరణ వాయిదా పడింది. ఇందుకు కారణం రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి విషయంలో పీటముడి పడటమేనని భావిస్తున్నారు.

కుటుంబంలో ఒక్కరికే

ఈనెల 3న మంత్రివర్గ విస్తరణ ఖాయం అనుకున్న నేపథ్యంలో అంతకుముందు కాంగ్రెస్ అధిష్ఠానం కీలక సమావేశం నిర్వహించింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... రాహుల్‌గాంధీ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్ తదితర కీలక నేతలు పాల్గొన్నారు. రాజగోపాల్‌రెడ్డి పేరు చర్చకు రాగా ఆయనకు ఎంపీ ఎన్నికల సమయంలో భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామనే హామీ ఇచ్చినట్టుగా రాష్ట్ర నేతలు ప్రస్తావించారు. ఎవరు హామీ ఇచ్చారని రాహుల్‌గాంధీ నేరుగా ప్రశ్నించగా, అప్పటి ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు హామీ ఇచ్చారని రాష్ట్ర నేతలు చెప్పినట్టు సమాచారం. ఆయన ఎవరి అనుమతితో హామీ ఇచ్చారంటూ రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఇప్పటికే అదే కుటుంబం నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రిగా ఉండగా రాజగోపాల్‌రెడ్డికి ఎలా హామీ ఇస్తారని నిలదీసినట్టు తెలిసింది. దీనిపై రాష్ట్ర ముఖ్యులు సర్దిచెప్పే ప్రయత్నం చేయబోగా, రాజగోపాల్‌రెడ్డికి ఇవ్వాలనుకుంటే అన్న వెంకట్‌రెడ్డిని పక్కన పెట్టండి. ఇక కుటుంబంలో ఒక్కరికే మంత్రి పదవి. ఇందులో తేడా లేదని రాహుల్‌గాంధీ కరాఖండిగా తేల్చిచెప్పడంతో వారంతా మిన్నకుండిపోయినట్టు సమాచారం. ఇదే విషయం పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం అలర్ట్ అయ్యారు.

జిల్లా ముఖ్యులే అడ్డుగా...

ఈ పరిణామాలన్నింటినీ రాజగోపాల్‌రెడ్డికి నేరుగా చెప్పే సాహసం చేయలేక రాష్ట్ర ముఖ్యులు సీనియర్ నేత కే జానారెడ్డిని వ్యూహాత్మకంగా తెరపైకి తెచ్చినట్టు తెలిసింది. పార్టీలో అత్యంత సీనియర్ నేతగా ఉన్న ఆయనతో ఉన్నట్టుండి వ్యూహాత్మకంగానే రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రి పదవి ఇవ్వాలంటూ లేఖ రాయించారని సమాచారం. జానారెడ్డి స్వతహాగా ఈ లేఖ రాయలేదని, దీని వెనుక రాష్ట్ర కీలక నేతలు ఎవరో ఉన్నారని రాజగోపాల్‌రెడ్డి వర్గీయులు భావించారు. ధర్మరాజుగా ఉండాల్సిన జానారెడ్డి ధృతరాష్ట్రుడిగా మారారంటూ రాజగోపాల్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా తనకు మంత్రి పదవి రాకుండా ఆదినుంచీ అడ్డుపడుతున్నారని రాజగోపాల్‌రెడ్డి భావిస్తున్నారు. తనకు మంత్రి పదవి దక్కకుండా అడ్డుపడటం కోసమే ఉత్తమ్ పద్మావతి పేరును తెరపైకి తెచ్చినట్టు రాజగోపాల్‌రెడ్డితోపాటు ఆయన వర్గీయులు భావిస్తున్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కూడా తమ్ముడికి మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తే తన పదవికి ఎక్కడ ఎసరు వస్తుందోనన్న భయం పట్టుకున్నదనే చర్చ జరుగుతున్నది. దాంతో ఒకవైపు జానారెడ్డి, మరోవైపు ఇద్దరు మంత్రులు కలిసి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి దక్కకుండా అడ్డుపడుతున్నారని రాజగోపాల్‌రెడ్డితోపాటు ఆయన అనుచరులు భావిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే తాడో-పేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యే ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఒక్కసారిగా హాట్ కామెంట్స్ చేశారనే చర్చ జరుగుతున్నది.

యూరప్ పర్యటనకు రాజగోపాల్‌రెడ్డి

మంత్రి పదవిపై చౌటుప్పల్, చండూరులో ఆదివారం తీవ్ర వ్యాఖ్యలు చేసి కాంగ్రెస్‌లో మంటలు పుట్టించిన రాజగోపాల్‌రెడ్డి ఆ వెంటనే యూరప్ పర్యటనకు బయల్దేరి వెళ్లారు. వ్యూహాత్మకంగానే విదేశీ పర్యటనకు వెళ్లే ముందు అధిష్ఠానానికి ఒకరకంగా హెచ్చరిక చేశారని తెలుస్తున్నది. ఈ నెల 23న ఆయన విదేశీ పర్యటన నుంచి తిరిగి రానున్నారు.

రాజీవ్‌యువ వికాసానికి 15.60 లక్షల దరఖాస్తులు

- 24 వరకు గడువు పొడిగించినట్టు సోషల్ మీడియాలో ప్రచారం

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువు సోమవారం అర్ధరాత్రి ముగిసింది. ఈ పథకం కోసం రాష్ట్రవ్యాప్తంగా సోమవారం సాయంత్రానికే 15.60 లక్షల దరఖాస్తులు వచ్చినట్టు అధికారవర్గాలు వెల్లడించాయి. రేషన్ కార్డు లేక, ఆదాయం సర్టిఫికెట్లు మంజూరుకాక లక్షలాది మంది దరఖాస్తు చేసుకోనట్టు తెలిసింది. రాజీవ్ యువవికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ తదితర వర్గాలకు రూ.6వేల కోట్లను సబ్సిడీ రుణాలుగా అందిస్తామని ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. దరఖాస్తుల స్వీకరణను మార్చి 24న ప్రారంభించగా, తొలుత ఈనెల 5 వరకే గడువు విధించింది. ఆ తరువాత 14వ తేదీ వరకు పొడిగించింది. 'రాజీవ్ యువ వికాసం' అని పేరు పెట్టినా 60 ఏండ్ల వరకూ అవకాశం కల్పించడంతో భారీగా దరఖాస్తులు వచ్చినట్టు తెలుస్తున్నది. ఈ పథకం దరఖాస్తుకు రేషన్ కార్డు లేదంటే ఆదాయం సర్టిఫికెట్‌ను సమర్పించాలనే నిబంధనను సర్కారు విధించింది. అయితే ఈ గడువును 24 వరకు పొడిగించినట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నది. అధికారికంగా ప్రకటన రాలేదు.

వాళ్ల రాజ్యం నడుస్తున్నది!

- పక్కజిల్లాలకూ హెలికాప్టర్‌లో..
- సెక్రటేరియట్‌పై హెలిప్యాడ్ పెట్టాలి
- ఆ పార్టీ నేతలపై దామోదర సెటైర్లు

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వంలో కొందరు మంత్రుల రాజ్యమే నడుస్తున్నదని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విమర్శలు గుప్పించారు. పక్క జిల్లాలకు కూడా హెలికాప్టర్‌పై వెళ్తున్నారని మండిపడ్డారు. సోమవారం మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేసిన ఆయన సొంతపార్టీ నేతలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తాను ఒక్కసారి హెలికాప్టర్ ఎక్కలేదని తెలిపారు. హెలికాప్టర్ ఎక్కాలన్నా వాళ్లే.. వాటిని కొనాలన్న వాళ్లేనని విమర్శించారు. ఆ కొందరైతే హెలికాప్టర్ లేకపోతే కాలు బయటపెట్టడంలేదని ఎద్దేవా చేశారు. ఆ మంత్రుల కోసం వారు సెక్రటేరియట్‌పై హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని దెప్పిపొడిచారు.

కిమ్స్‌లో చిన్నారికి అరుదైన చికిత్స

- క్యాన్సర్‌కు విజయవంతంగా ఆపరేషన్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని లాలాపేట ప్రాంతానికి చెందిన రక్షిత్ అనే రెండేండ్ల బాలుడు అరుదైన క్యాన్సర్ బారిన పడ్డాడు. 10 లక్షల మందిలో 8 మందికి సోకే న్యూరోబ్లాస్టోమా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆ బాలుడికి సికింద్రాబాద్‌లోని 'కిమ్స్' దవాఖాన వైద్యులు విజయవతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. దీంతో ఆ బాలుడు వేగంగా కోలుకున్నట్టు 'కిమ్స్' సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మధు దేవరశెట్టి వెల్లడించారు. నాడీ కణజాలం నుండి అభివృద్ధి చెందే న్యూరోబ్లాస్టోమా క్యాన్సర్ సాధారణంగా 15 ఏండ్ల లోపు పిల్లలకు సోకుతుందని, మూత్రపిండాలపైన అడ్రినల్ గ్రంథి, మెడ, చాతీ, పెల్విస్ నరాల కణజాలం నుంచి ప్రారంభమయ్యే ఈ వ్యాధి 5 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలను ప్రభావితం చేస్తుందని ఆయన వివరించారు.

గెజిట్‌ను ఎందుకు ప్రచురించలేదు?

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కనీస వేతనాలకు సంబంధించి గెజిట్‌ను ప్రచురించాలన్న తమ ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆ వ్యవహారంపై వివరణ ఇస్తూ కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. ఐదేండ్లకోసారి కనీస వేతనాలను సవరిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ 2007 తర్వాత నుంచి ఇప్పటివరకు విడుదల చేయలేదంటూ 2023లో తెలంగాణ రీజినల్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసింది. దీంతో వెంటనే గెజిట్‌ను ప్రచురించాలని హైకోర్టు అప్పట్లోనే ప్రభుత్వాన్ని ఆదేశించింది. కానీ, ఆ ఆదేశాలు నేటికీ అమలు కాకపోవడంతో తాజాగా ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు.. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

పోలీసు ఫిర్యాదుల సంస్థ చైర్మన్‌గా శివశంకర్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర, జిల్లా పోలీసు ఫిర్యాదుల సంస్థ చైర్మన్‌గా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శివశంకర్‌రావు సహా సభ్యులను నియమిస్తూ రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్టేట్ అండ్ డిస్ట్రిక్ట్ పోలీసు కంప్లైంట్ అథారిటీకి చైర్మన్ సహా సభ్యులను నియమించారు. సభ్యులుగా రిటైర్డ్ ఐపీఎస్ పీ ప్రమోద్‌కుమార్, న్యాయవాది వర్రె వెంకటేశ్వర్లు, సభ్య కార్యదర్శిగా శాంతి భద్రతల అదనపు డీజీని నియమించారు. జిల్లాస్థాయిలో హైదరాబాద్ రేంజ్‌కు చైర్‌పర్సన్‌గా జిల్లా రిటైర్డ్ జడ్జి కే సుదర్శన్, సభ్యులుగా మాజీ జర్నలిస్టు పీ రామ్మోహన్, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రామనర్సింహ, సభ్య సెక్రటరీగా మల్టీజోన్-2 ఐజీని నియమించారు. వరంగల్ రేంజ్‌లో చైర్‌పర్సన్‌గా జిల్లా రిటైర్డ్ జడ్జి వై అరవిందర్‌రెడ్డి, సభ్యులుగా రిటైర్డ్ ఎస్పీ ఎం నారాయణ, సామల రాజేందర్, సభ్య సెక్రటరీగా మల్టీజోన్-1 ఐజీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు సీఎల్పీ సమావేశం

- నోవాటెల్‌లో మీటింగ్
- నాలుగు కీలక అంశాలపై చర్చించే అవకాశం
- అనంతరం జపాన్ పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ(సీఎల్పీ) సమావేశం మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్నది. శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సమాచారం అందజేసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో ప్రధానంగా నాలుగు అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. భూభారతి, ఎస్సీ వర్గీకరణ, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లపై చర్చించనున్నట్టు పార్టీ వర్గాలు చెప్పాయి. ఈ నాలుగు అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేయనున్నట్టు తెలిసింది. మంత్రివర్గ విస్తరణపై తాజాగా మల్‌రెడ్డి రంగారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు చేసిన వ్యాఖ్యలపై కూడా చర్చించే అవకాశాలు ఉన్నాయి. సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి శంషాబాద్ విమానాశ్రయం నుంచి జపాన్ పర్యటనకు బయల్దేరనున్నారు.

జానారెడ్డి షాక్.. విస్తరణకు బ్రేక్!

> మొదటిపేజీ తరువాయి...

ప్రభావం మాత్రం గట్టిగానే కనిపిస్తున్నది. కసరత్తు లేకుండా కూర్పు జరిగితే ప్రభుత్వ మనుగడ ప్రమాదంలో పడటం ఖాయమని ఆయన హెచ్చరించి ఉంటారని గాంధీభవన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

వేర్వేరుగా జాబితాలు

మంత్రివర్గంలో ఆరు స్థానాలు ఖాళీ ఉండగా దాదాపు 30మంది ఔత్సాహికులు పోటీపడుతున్న విషయం తెలిసిందే. అధిష్ఠానం దూత మీనాక్షి నటరాజన్ తెలంగాణకు వచ్చి దాదాపు 20రోజులు ఇక్కడే మకాం వేసి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆమె నుంచి అందిన సిగ్నల్ మేరకే టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అధిష్ఠానంతో కూర్పుపై చర్చించి వచ్చారు. ఈ నలుగురిలో ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు కలిసి ఒక జాబితా, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా చెరో జాబితా కాంగ్రెస్ అధిష్ఠానానికి ఇచ్చినట్టు తెలిసింది.

జానారెడ్డి లేఖలో ఏముందో..

నల్లగొండ జిల్లా నుంచి ఒక్క రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వటం వలన ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్‌రావుకు, వరంగల్ జిల్లా నుంచి దొంతి మాధవరెడ్డికి, రంగారెడ్డి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డికి చెక్ పెట్టినట్టు అవుతుందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇది నూటికి నూరుపాళ్లు ముఖ్యనేత రాజకీయ వ్యూహమేనని కాంగ్రెస్ పార్టీ వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పార్టీ సీనియర్ నేత జానారెడ్డి రాసిన లేఖ ఆ పార్టీలో కాకరేపుతున్నది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు అసలు మంత్రివర్గంలో ప్రాధాన్యం లేకుండా పోయిందని, ఈ రెండు జిల్లాలు రాష్ట్రంలో ప్రధానమని ఆయన లాజికల్ పాయింట్ లేవనెత్తారట. కానీ ఈ ఒక్క పాయింట్‌తోనే పార్టీలో ఇంత వేడి పుడుతున్నదంటే కాంగ్రెస్ నేతలు ఎవరూ నమ్మటం లేదు. కొత్త మంత్రులను ప్రమాణ స్వీకారానికి పిలుద్దామని డేట్ ఫిక్స్ చేసుకున్న అధిష్ఠానం జానారెడ్డి ఇచ్చిన షాక్‌తో.. విస్తరణకు బ్రేక్ వేసిందంటే లేఖలో ఇంకేదో ప్రస్తావించి ఉంటారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు అనుమానిస్తున్నాయి.

> 'మంత్రివర్గంలో నాకు చోటు లేకుంటే.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసినట్టే. ఆదివాసీలకు, పార్టీ కార్యకర్తలకు ఊపిరిగా నిలిచిన నాకే అన్యాయం చేస్తారా? పదేండ్లు పార్టీని కాపాడుకుంటే ఇదేనా మాకిచ్చే గౌరవం. వేరే పార్టీలు తిరిగొచ్చిన వారికి పదవులు కావాలా? అలా ఇస్తానంటే కుదరదు.
>
> - మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

> 'మంత్రి పదవి రాకుండా సీనియర్ నేత జానారెడ్డి అడ్డం పడుతున్నారు. ధర్మరాజులా ఉండాల్సిన వ్యక్తి.. ధృతరాష్ట్రుడిలా వ్యవహరిస్తున్నారు. 30 ఏండ్లు మంత్రి పదవి అనుభవించిన జానారెడ్డికి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రి పదవి ఇవ్వాలనే విషయం ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? మంత్రి పదవి అడుక్కుంటే వచ్చేది కాదు..కెపాసిటీతో వస్తుంది'
>
> - మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

> 'నేను బీజేపీలో ఉండి ఉంటే కేంద్రమంత్రిని అయ్యేవాన్ని. రేవంత్‌రెడ్డి ఆహ్వానిస్తే కాంగ్రెస్ పార్టీలోకి వచ్చాం. గడ్డం కుటుంబం పోటీ చేయడం వల్లనే ఈ ప్రాంతంలో (ఆదిలాబాద్ జిల్లాలో) కాంగ్రెస్ గెలిచింది'.
>
> - చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్

ఒక్క గొడుగు కిందికి అసంతృప్తవాదులు

మంత్రి పదవులకు ఆశపడి గోడదూకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను ఎవరూ పట్టించుకోలేదని, వారి చేత రాజీనామా చేయించి, ఉప ఎన్నికలకు వెళ్లకుండా ఉండటమే వారికి లభించే గొప్ప పదవి అన్నట్టు పరిస్థితి ఉన్నదనే ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో అసంతృప్తివాదులు అంతా ఒక్క చోట కలిస్తే 20 మంది అవుతున్నారని ఢిల్లీ కాంగ్రెస్‌కు నివేదికలు అందినట్టు తెలిసింది. దీనితోపాటు దక్షిణ తెలంగాణకు చెందిన కీలక నేత ఒకరు పార్టీ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఆయనకు అత్యంత ఆప్తునిగా గుర్తింపు ఉన్న ఓ మంత్రిని కూడా తొలగిస్తారనే ప్రచారం నేపథ్యంలో ఆయన ఈ అందరిని ఒక చోటకు తీసుకువచ్చే అవకాశం ఉందని సొంత నిఘా వర్గాలు హెచ్చరించినట్టు తెలిసింది. మరోవైపు సుదర్శన్‌రెడ్డి పేరు తెరమీదకు రావటంతో నర్సంపేట ఎమ్మెల్యే, సీనియర్ కాంగ